క్లుప్తంగా

పామర్రులో సామూహిక లక్ష కుంకుమ పూజ



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో గురువారం భక్తులు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా పంచామృతాలతో అభిషేకాలను చేశారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, నవగ్రహ పూజ అనంతరం అమ్మవారికి శత సహస్ర నామాలతో విశేషంగా లక్ష కుంకుమ పూజ జరిపించారు. దాత అప్పల శ్రీనివాసరావు, సునీత దంపతులు భక్తులకు ప్రసాదాలను సమర్పించారు. ఆలయంలో పూజాదికాలను ముత్తేవి మాధవ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, బొగ్గరపు సాయిబాబు, కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంటాడలో...

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి గత 18 రోజులుగా జరుగుతున్న కుంకుమపూజ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన అవసరం

గుడివాడరూరల్: ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ టి.అరుణకుమార్ అన్నారు. స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో గురువారం రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అంకిత సంస్థ వారు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, పీడీ జి.బేబి సరోజిని, ఏఎన్ఎం జి.లావణ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడరూరల్: ఈనెల 25న ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్స్ చెస్ పోటీల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మీప్రసాద్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు పి.సిరజ్ ద్వితీయస్థానం, కె.జయదత్త సాయి, కె.జయశంకర్, ఎల్.లలిత్‌సాయి, ఎస్.దీపక్‌రెడ్డి, ఎస్.నందీష్, ఎస్.భాను ప్రకాష్, పి.మోహిత్‌రెడ్డి, వి.వంశీకృష్ణ, ఎం.దియాన్ సుధాన్స్, పి.యువ మొదటి పది స్థానాల్లో గోల్డ్ మెడల్స్ సాధించి తదుపరి లెవల్‌కు సెలెక్ట్ అయ్యారని వివరించారు. విజేతలను, కోచ్ స్వర్ణలతను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతిలతో పాటు అధ్యాపకులు అభినందించారని లక్ష్మీప్రసాద్ తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన

పామర్రు: సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి మహిళల పట్ల సోదర భావంతో మెలగాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. పామర్రు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మార్కెట్ యార్డులో పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ దగ్గర చదువుకునే ఆడపిల్లలను తమ కన్నబిడ్డలుగా భావించి విధులు నిర్వర్తించాలని అన్నారు. పామర్రు సీఐ సుభాకర్ పోక్సో చట్టాల గురించి వివరించారు. పామర్రు ఎంఈవో-2 గుమ్మడి పద్మవాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పామర్రు ఎస్ఐ అవినాష్, ఎంపీడీవో వై.రామకృష్ణ, లయన్స్ జిల్లా కోఆర్డినేటర్ పీఎంఎస్ ప్రసాద్, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ రాజామణి, హెచ్‌ఎం మృదుల పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో...

గుడ్లవల్లేరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పోక్సో చట్టంపై ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.జగన్మోహన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ.వాణి, ఏఎస్ఐ సారథి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గుడివాడ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ స్పెషల్ సీఎస్ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో డీసీగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావు కృష్ణాజిల్లా గుడివాడ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీవీ కృష్ణారావు ఏలూరు జిల్లా నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

నేడు వన మహోత్సవం

మండవల్లి: కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం ఎస్వై మాధవ్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపు మేరకు హైస్కూల్‌లో గ్రామస్తుల ఆర్థిక సాయంతో రూ.30వేల విలువ గల మొక్కలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

కోల్‌కతా ఘటన అత్యంత దారుణం



కోల్‌కతా వైద్యురాలిపై అత్యాచార, హత్య ఘటన అత్యంత దారుణం. దేశ సైనికులు ఏ విధంగా రక్షణ కల్పిస్తున్నారో, అదే విధంగా ప్రజల ప్రాణాలకు డాక్టర్లు రక్షణ కల్పిస్తున్నారు. మహిళలు రాత్రి వేళ ఒంటరిగా నడిచినప్పుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్లని మహాత్మా గాంధీజీ చెప్పారు. నేడు నాలుగు గోడల మధ్య కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ పీవీవీ పుల్లేశ్వరరావు, వర సంజీవని హాస్పిటల్, కైకలూరు

కన్నెత్తి చూడాలంటేనే భయపడాలి



మహిళలను కన్నెత్తి చూడాలంటేనే భయపడే విధంగా ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలి. కోల్‌కతా ఘటన సిగ్గుతో తలదించుకునేలా ఉంది. ప్రాణాలను కాపాడుతున్న వైద్య సిబ్బందికి రక్షణ లేకపోతే ఎలా పని చేస్తాం. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. మళ్లీ మళ్లీ ఇలా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎస్.పుణ్యవతి, ఎంపీహెచ్ఏ(ఎఫ్), పీహెచ్‌సీ, శీతనపల్లి, కైకలూరు మండలం

క్రీడా రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ధ్యాన్‌చంద్

ఎన్టీఆర్ స్టేడియంలో వైభవంగా క్రీడా దినోత్సవం



గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యలవర్తి తదితరులు

గుడివాడరూరల్: భారత క్రీడారంగానికి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని, అందుకే ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకొంటున్నామని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో గురువారం స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, కమిటీ సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, పర్వతనేని ఆనంద్, స్టేడియం అధికారులు, సిబ్బంది, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏఎన్ఆర్ కళాశాలలో...

గుడివాడరూరల్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డాడలో...

అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలో అరవింద హైస్కూల్‌లో ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు.తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన సంప్రదాయ ఆటలైన ఏడు పెంకుల ఆట, పులిమేక, పచ్చీస్, దాడి, గచ్చకాయలు, చదరంగం, బొంగరాలు, వంగుడు దూకుడు తదితర ఆటలను పిల్లలతో ఆడించారు.



పామర్రులో మ్యూజికల్ చైర్ ఆట ఆడుతున్న విద్యార్థులు

పామర్రులో...

పామర్రు జెడ్పీ హైస్కూల్లో పాఠశాల పీడీలు గుమ్మడి మురళి, మల్లా రవికిషోర్‌లను కూడా సత్కరించారు. అసిస్సీ హైస్కూల్‌లో గోలీలు, కుంటుకుంటుడు, ముద్దర్ బాల్, కప్ప గెంతుళ్లు, మ్యూజికల్ చైర్ ఆడించి విజేతలకు బహుమతులందజేశారు. సిస్టర్ వలసా సబాస్టియన్, కరెస్పాండెంట్ రోజ్ థామస్, పీఈటీ గ్లాడిసన్ పాల్గొన్నారు.

గురజలో...

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. గురజ జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా పోటీలు, తెలుగు బాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లి, వడాలి, పెదగొన్నూరు హైస్కూళ్లలో పీఈటీల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు.



గురజ హైస్కూల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



అడ్డాడలో వామనగుంట ఆడుతున్న చిన్నారులు



ఏఎన్ఆర్ కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, పాలకవర్గ సభ్యులు

మండవల్లిలో...

మండవల్లి: మండవల్లి హైస్కూల్‌లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడా దినోత్సవం ప్రాముఖ్యతను వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

గుడ్లవల్లేరులో...

గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ఎం.శివశంకర్ నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పమిడిముక్కల హైస్కూల్‌కు క్రీడా పురస్కారం

పమిడిముక్కల: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అవనిగడ్డ డిగ్రీ కాలేజీలో గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిన పమిడిముక్కల హైస్కూల్‌కు క్రీడా పురస్కారం అవార్డు లభించాయి. హెచ్‌ఎం వి.కేశవనారాయణ, పీడీ నారాయణకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఈఓ తాహెరా సుల్తానా చేతులమీదుగా అవార్డు అందజేశారు. అవార్డు పొందిన హెచ్‌ఎం, పీడీలను, డీవైఈవో పద్మారాణి, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీపీ వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణ కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.



అవనిగడ్డలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం, పీడీ

గుడ్లవల్లేరు ఎస్ఐగా సత్యనారాయణ



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఎస్ఐగా ఎన్.వి.వి.సత్యనారాయణ నియమితులయ్యారు. గురువారం ఆయన స్థానిక పీఎస్‌లో బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను ఏఎస్ఐ సారథి, పోలీసు సిబ్బంది అభినందించారు.

95 పశువులకు వైద్య పరీక్షలు

వేములమడ(మొవ్వ): రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి, జిల్లా పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో గురువారం మొవ్వ మండలం వేమలమడ గ్రామంలో పశు ఆరోగ్య, గర్భకోశ వ్యాధి నివారణా వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా 95 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సహాయ సంచాలకులు డాక్టర్ ఎంఎస్ఏ దివాకర్ రైతులకు పశుపోషణకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వాటి దరఖాస్తు విధానంపై, మినీ గోకులం, బ్యాంక్ లోన్లపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ సీతారామయ్య శిబిరానికి సహకరించగా, వైద్యులు సృజన్, మనోజ్, హరిత, సుధాకర్, మాధవి,శ్యామల, శ్రీను, భాస్కర్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

వైభవంగా గంగానమ్మ జాతర

మండవల్లి: మండవల్లిలో యాదవ కులస్తులు గంగానమ్మ జాతర కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. పోతురాజును పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల కనుగుణంగా యువకులు చేసిన నృత్యం అలరించింది. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, ఆగొల్లు గంగారావు, నల్లిబోయిన రాజేష్, ఆగొల్లు వెంకన్న, చేబోయిన శ్రీను, చెన్ను పండు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను మరిస్తే అమ్మను మరిచినట్టే



పామర్రులో తెలుగు ఉపాధ్యాయులు, పీడీలను సత్కరించిన కళాపీఠం నిర్వాహకులు



కూచిపూడిలో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాట్య కళాపీఠం సిబ్బంది



పెయ్యేరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గుడివాడరూరల్: తెలుగు భాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్లేనని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రబాబు అన్నారు. తెలుగుభాషా దినోత్సవాన్ని కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైస్ ప్రిన్సిపాల్ ఆలియాబేగం, రిటైర్డ్ అధ్యాపకుడు, రచయిత కొడాలి సోమసుందరరావుతో కలసి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకురాలు నాగలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పామర్రులో...

పామర్రు: పద్మశ్రీ ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని మసలుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరా రాణి, తెలుగు ఉపాధ్యాయులు పరాశరం రంగవల్లి, చిన్నం నాగ సుబ్బమ్మ, వీర్ల శివ నాగ వెంకట గంగాధర్‌లను సత్కరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు. పామర్రులోని అసిస్సీ, అడ్డాడ గ్రామంలోని అరవింద హైస్కూళ్లలో కూడా తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించారు.

కూచిపూడిలో...

కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కళాపీఠం వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు తల్లికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల నాట్యాచార్యులు డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసు, వేదాంతం వెంకట దుర్గా భవాని, పసుమర్తి హరినాథ శాస్త్రి, లైబ్రేరియన్ వైవీ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లిలో...

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిత్ర పటాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గుడ్లవల్లేరు ఫార్మసీలో...

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుడివాడ వికాస సమితి వ్యవస్థాపక సమన్వయ కర్త డీఆర్‌బీ ప్రసాద్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు భాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు విశదీకరించారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండిలో...

కలిదిండి(కైకలూరు): గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం కలిదిండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీ నిర్వహించారు. స్థానిక శిశు స్కూల్ విద్యార్థులు లౌక్య, దీక్షిత, భానుశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ముఖ్య అతిథులుగా దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో సింగనపల్లి శ్రీనివాస్, స్థానిక రంగస్థల నటులు దుగ్గిరాల పరమేశ్వరరావు, గంగామణి దంపతులు, తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్.పద్మలత హాజరయ్యారు. ప్రోత్సాహక బహుమతులను కలిదిండి వాసవి క్లబ్ నాయకులు చక్కా జగన్ అందించారు. స్థానిక నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేషనల్ స్కూల్ కరస్పాండెంటు గురజాడ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లిలో...

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం పీవీ ప్రసాద్ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు

ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి



వలివర్తిపాడులో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ రమాదేవి, ఏవో అనంతలక్ష్మి

గుడివాడరూరల్: పంట పొలాలకు ఎరువులను వినియోగించే విషయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. మండలంలోని వలివర్తిపాడు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.తొలుత గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. రైతులకు పొలంలోనే ఎరువుల వినియోగం, మిగిలిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలంలో అధికంగా ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలను సాగు చేశారని, ఈ రకానికి సంబంధించి పంట పొలాలకు తగు మోతాదులో యూరియాను పిచికారీ చేయాలని సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులు అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ బోలెం అనంతలక్ష్మి, వీఏఏలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు తప్పనిసరిగా బీమా తీసుకోవాలి

అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

గుడివాడరూరల్: కార్మికులుగా ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా తీసుకోవాలని న్యాయ విజ్ఞాన సదస్సు చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని కోర్టు కార్యాలయంలో ఉన్న రాష్ట్ర న్యాయసేవాధికారి ఉత్తర్వుల మేరకు అసంఘటిత కార్మికులకు గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు వారికి బీమా చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ బిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి హరనాథ్, పలువురు న్యాయవాదులు, కార్మికులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలి

ముదినేపల్లి రూరల్: వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, దాతల సహకారంతో పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవలు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల ముదినేపల్లి-2 ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న నిమ్మగడ్డ ఎలీనా రాణి ఉత్తమ ఏఎన్ఎంగా అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను అభినందించి సత్కరించారు.

సంక్షిప్తం

• వివాహ వయస్సుపై అవగాహన

మండవల్లి: చింతపాడు, లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వివాహ వయస్సుపై ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది యుక్త వయస్సు బాల బాలికలకు గురువారం ఆరోగ్య విస్తరణ అధికారి టీఎస్ బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, పి.లావణ్య, కె.భాస్కర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

• విద్యార్థులకు క్విజ్ పోటీలు

కైకలూరు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా, అంతర్జాతీయ ఓమౌజయ యువ చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్పోర్ట్స్, గేమ్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో 9 పాఠశాలలకు చెందిన తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. నేషనల్ హైస్కూల్ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ద్వితీయ, తృతీయ బహుమతులను మాత ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎస్ఎస్ఎన్ ప్రభుత్వ పాఠశాలలు దక్కించుకున్నాయి. విజేతలకు రూ.3000, రూ.2000, రూ.1000 నగదు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. యువ చైతన్య సమాఖ్య స్థానిక అధ్యక్షుడు మారగాని వంశీ, టౌన్ ఎస్ఐ ఆర్.సత్యనారాయణ, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ అధ్యాపకురాలు ఎన్.అనసూయ, రిటైర్డ్ ఇంటెలిజెన్స్ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

• ‘పది’ ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులకు గురువారం నగదు బహుమతులు అందజేశారు. ఈ హైస్కూల్‌లో 2023-24 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన పి.దీక్షిత, బి.సుష్మలకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.15 వేలు చొప్పున తృతీయ బహుమతిగా కె.అనంత ప్రకాష్‌కు రూ.10 వేలు, టి.జస్వంతీ, పి.జితేష్, టి.మౌనికలకు రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

• యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ముదినేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యునైటెడ్ పెన్షన్ విధానం (యూపీఎస్)ను రద్దు చేయాలని ముదినేపల్లి మండల మహిళా ఫ్యాప్టో నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. యూపీఎస్‌కు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జె.జయలక్ష్మి, ఎం.సాయిలక్ష్మి, వెంకటలక్ష్మి, కృష్ణ కుమారి, విజయకుమారి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

• ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక ఎమ్మార్సీ భవన్ వద్ద ఉపాధ్యాయినులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల ఉపాధ్యాయినులు చెస్, క్యారమ్స్, ఖోఖో వంటి క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారని ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు.